# వైభవంగా వాసవీమాత శోభాయాత్ర

- అలరించిన మహిళల దాండియా, చిన్నారుల అడుగుల భజన, నృత్యాలు

మక్తల్ అర్బన్, అక్టోబర్ 25: పట్టణంలో కన్యకాపరమేశ్వరీ మాతా శోభాయాత్ర వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరన్నవరా త్రోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి వాసవీమాత ఉత్సహ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అందంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై ఉంచి కన్యకాపరమేశ్వరీ ఆలయ నుంచి అంబేద్కర్, ఆజాద్‌నగర్, గాంధీచౌక్, బ్రాహ్మణవాడీ మీదుగా ఆర్యవైశ్య మహిళలు దాండియా, బతుకమ్మ, అడుగుల భజనలు, చిన్నారుల ఆటా పాటల మధ్య అమ్మవారి శోభాయాత్ర అంగరంగవైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కట్ట సురేశ్, శ్రీనివాస్, బొరిశెట్టి భాస్కర్, వెంకటేశ్, నరహరి, నాగరాజ్, తాళంపల్లి అనిల్, వట్టం రతన్, రతన్, నరేశ్, కిరణ్, రంజిత్, సుభాష్, నవీన్, తిరుపతి, మీరాబాయి, విజయలక్ష్మి, పద్మసరళ, సంధ్య, ప్రసన్న, త్రివేణి, సుజాత, ప్రత్యూషా, శోభ, ఉషారాణి, సుస్మిత,అశ్విని, కీర్తి తదితరులు పాల్గొన్నారు.



మక్తల్‌లో వాసవీమాత శోభాయాత్రలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

## ఘనంగా అమ్మవారి నిమజ్జనం

ఆత్మకూరు, అక్టోబర్ 25: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాల నిమ్మజనం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం, కన్యకా పరమేశ్వరీ ఆలయం, కోట్ల ఆంజనేయస్వామి ఆలయం, స్పటిక లింగేశ్వరస్వామి ఆలయం, వేంకటేశ్వరస్వామిఆలయం, మల్లాపురం ఆలయం, వాల్మీకి నగర్‌లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహాలను ఆయా సంఘాల ఆధ్వర్యంలో శోభాయాత్రగా నిమజ్జనానికి తరలించారు. శోభాయాత్రలో మహిళలు, యువతీ యువకులు కోలాటాలు, బతుకమ్మ ఆటపాటలతో నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు గాడి లక్ష్మినారాయణ, ఆయా ఉత్సవ కమిటీల ప్రతినిధులు, రాజకీయ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## కాళికామాత ఆలయంలో అన్నదానం

అమరచింత, అక్టోబర్ 25: పట్టణంలోని కాళికామాత ఆలయంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని మున్సిపాల్ చైర్‌పర్సన్ మంగమ్మ ప్రారంభించినట్లు ఆలయ నిర్వాహకులు నాగేశ్వర్‌రెడ్డి, తాటికొండ రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారన్నారు. ఈ సందర్భంగా భక్తులు వస్తురూపంలోకానుకులతో పాటు పట్టుచీరలు, వడి నింపి మొక్కలు చెల్లించుకున్నారన్నారు. అమ్మవారిని అలంకరించిన పట్టుచీరలను భక్తుల సమక్షంలో వేలం వేస్తామని, అలాగే అమ్మవారికి వడి నింపిన బియ్యంతో భక్తులకు అన్నదానం చేశామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో దుర్గామాత నిమజ్జన ఊరేగింపులో చిన్నారుల నృత్యప్రదర్శన



అమరచింతలో అన్నదానం చేస్తున్న కాళికామాత ఆలయ కమిటీ సభ్యులు

## కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలు

- ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి
- ఎమ్మెల్యే చిట్టెం తనయుడు చాణిక్యరెడ్డి



చాణిక్యరెడ్డిని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కృష్ణ, అక్టోబర్ 25 : దేశంలో ఎక్కడ లేని విధంగా అమలు చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే చిట్టెం తనయుడు, బీఆర్‌ఎస్ యువ నాయకుడు చాణిక్యరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గుడెబల్లూర్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలన్నారు. ముఖమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పదేండ్లలో మక్తల్ నియోజక వర్గం అభివృద్ధి పథంలో నిలుపారని అన్నారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలను గడప గడపకు వివరించాలన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకు ముందు గ్రామస్తులు ఆయనకు ఘనస్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌నాయకులు ఆంజనేయులు, అమరేశ్, శంక్రప్ప, సురేశ్, వెంకటేశ్, సంతోశ్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహన తనిఖీ

ఊట్కూర్, అక్టోబర్ 25: మండలంలోని సంస్థాపూర్ చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటక బార్డర్ గ్రామాల నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. అనంతరం ఎస్సై గోకరి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు వాహనాల్లో ప్రయాణించే వారు రూ. 50 వేలకు మించి నగదును తరలించరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నగదు, మద్యం రవాణాకు పాల్పడితే సీజ్ చేస్తామన్నారు. బార్డర్ చెక్‌పోస్టు వద్ద ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## రూ.4.16 లక్షల పట్టివేత




డబ్బును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కృష్ణ, అక్టోబర్ 25 : మండలంలోని తెలంగాణ-కర్ణాటక బార్డర్ చెక్‌పోస్ట్ వద్ద బుధవారం వాహనాల తనిఖీలో రూ.4,16,500 పట్టుబడ్డట్లు ఎస్సై విజయ్‌భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, గోవా నుంచి డబ్బు, మద్యం రావాణా కాకుండా కృష్ణ బార్డర్ చెక్ పోస్టు వద్ద ముమ్మర తనిఖీలు చేపడుత్తున్నామన్నారు. అందులో భాగంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కర్ణాటకకు చెందిన గంగాధర్ కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.4,16,500 తరిలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. డబ్బును కృష్ణ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఎక్సైజ్ ఎస్సై సతీశ్ తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది, ఎస్ఎస్‌బీ సిబ్బంది పాల్గొన్నారు.

## రైలు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మక్తల్‌టౌన్, అక్టోబర్ 25: రైలు ఢీకొని యువకుడి చేయి తెగిపడ్డ ఘటన మక్తల్ రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు మక్తల్ మండలం ఉప్పర్‌పల్లి గ్రామానికి చెందిన నవీన్‌కుమార్‌రెడ్డి బుధవారం ఉదయం ఇయర్‌ఫోన్స్ చెవిలో పెట్టుకొని పాటలు వింటూ రైల్వే ట్రాక్ మధ్య నుంచి నడుచుకుంటూ వెళ్తూ రైలు రావడాన్ని గమనించలేదు. దీంతో 6:30 గంటలకు వచ్చే గూడ్స్‌రైలు నవీన్‌కుమార్‌రెడ్డిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎడమచేయి సగానికి పైగా తెగి పడింది. ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం మక్తల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు. మక్తల్ రైల్వేస్టేషన్ పరిధిలో రెండు నెలల్లోనే ఉప్పర్‌పల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రైలు ప్రమాదానికి గురికావడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ఊట్కూర్, అక్టోబర్ 25 : రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జమాతె ఇస్లామీహింద్ (జేఐహెచ్) మండల అధ్యక్ష, కార్యదర్శులు గడ్డ మన్సూర్‌అలీ, మహ్మద్ జావేద్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో జేఐహెచ్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులందరూ కొత్తగా ఓటరు నమోదు చేయించుకోవాలని సూచించారు. జేఐహెచ్ మండల శాఖ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే సామాన్యులకు ఇబ్బంది లేకుండా ఉచితంగా ఆన్‌లైన్ ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల్లో నిస్వార్థ సేవకులను ఎన్నుకోవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో నిస్వార్థ సేవకులను ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహిమాన్, జేఐహెచ్ మండల నాయకులు డాక్టర్ లియాఖత్‌అలీ, నాసీర్‌ఖాన్, అబ్దుల్ ఖాలిక్ తదితరులు పాల్గొన్నారు.



ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి

## 20 మంది బైండోవర్

దేవరకద్ర, అక్టోబర్ 25: మండలంలోని జీన్గురాల, బస్వాపూర్, డోకూర్ గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న 20 మందిని పోలీసులు బుధవారం తాసీల్దార్ బ్రహ్మంగౌడ్ ఎదుట బైండవర్ చేశారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు.



తాసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న పోలీసులు

### నేడు బొడ్రాయి

## ప్రతిష్ఠాపనోత్సవ కమిటీ సమావేశం

అమరచింత, అక్టోబర్ 25: పట్టణంలోని భక్తమార్కేండయ స్వామి ఆలయంలో గురువారం ( నాబిశిల ) బొడ్రాయి ప్రతిష్ఠోత్సవ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యుడు కొంగరి కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వచ్చె నెల 14,15,16 తేదీల్లో పట్టణంలో పలు చోట్ల బొడ్రాయిలు ప్రతిష్ఠించనున్న ఆయన తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీచుపల్లి శంకరాచార్యులు, కృష్ణప్రసాద్ ఆచార్యులు హాజరు కానున్నరన్నారు. కావున సమావేశానికి ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు పట్టణంలోని వివిధ కూల సంఘాల నాయకులు, పట్టణ ప్రముఖులు విధిగా హాజరు కావాలని కోరారు.

## యువకుడి మృతదేహం లభ్యం

ఆత్మకూరు, అక్టోబర్ 25: పట్టణ సమీపంలోని జూరాల ఎడమ కాలువలో మంగళవారం గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. అత్మకూరు పట్టణానికి చెందిన జాఫర్‌సమీ(22) బట్టలు ఉతకడానికి జూరాల ఎడమ కాలువ వద్దకు వెళ్లగా ప్రమాదవాశాత్తు కాలువలో పడి కొట్టుకుపోయాడు. దీంతో పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో కాలువలో మృతదేహం కోసం జల్లెడ పట్టారు. బుధవారం రామన్‌పాడ్ రిజర్వాయర్ బ్యాక్‌వాటర్‌లో మత్స్యకారులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. వారు మృతదేహాన్ని బయటకు తీయించి స్థానిక సర్కారు దవఖానాకు తరలించి పంచనామ నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పజెప్పినట్లు ఎస్సై నరేందర్ తెలిపారు.